పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కన్నబాబురాజు



గడప గడపకు మన ప్రభుత్వంలో కొండపాలెం స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి రాజు(కన్నబాబురాజు) కొనియాడారు. అచ్యుతాపురం మండలం పూడిమడక సచివాలయం–2 పరిధిలోని కొండపాలెంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలు అందని అర్హులెవరైనా ఉంటే తక్షణమే సచివాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఎవరికైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కొందరు టీడీపీ నేతలు మత్స్యకార ప్యాకేజీ నిధుల స్వాహాపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.

కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, స్థానిక సర్పంచ్ చేపల సుహాసిని, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు, పిళ్లా సతీష్, చేపల వెంకటరమణ, చేపల శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా కొత్తమహాలక్ష్మి పండగ



ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మునగపాక : స్థానికంగా పేరుగాంచిన పేటకట్టు కొత్తమహాలక్ష్మి అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సంబంధిత సంఘ సభ్యులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ భక్తులు భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట : పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాయకరావుపేట, పి.ఎల్.పురం, సీతారాంపురం, నామవరం, గుంటపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. అసౌకర్యాన్ని మన్నించి, సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి

పాయకరావుపేట : పాయకరావుపేట సబ్ ట్రెజరీ పరిధిలోని ప్రభుత్వ పింఛనుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సబ్ ట్రెజరీ అధికారి అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేయించుకోని వారు ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబరుతో ట్రెజరీ కార్యాలయానికి వస్తే, తమ సిబ్బంది సహాయం చేయనున్నట్టు పేర్కొన్నారు.

భగవద్గీతపై అవగాహన



పిల్లలకు అవగాహన కల్పిస్తున్న రాము

మునగపాక : ప్రతి ఒక్కరూ వేసవి సెలవుల్లో భగవద్గీత సారాన్ని అర్థం చేసుకునేందుకు దృష్టి సారించాలని భగవద్గీత ప్రచారకులు భీశెట్టి రాము కోరారు. మండలంలోని మంగళవరప్పేటలో 'మా ఊళ్లో గ్రంథాలయం' ఆధ్వర్యంలో వేసవి సందర్భంగా పిల్లలకు గత కొన్ని రోజులుగా చదవడం నాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విజ్ఞానాన్ని మరింత పెంచేందుకు భగవద్గీత శ్లోకాలను నేర్పించడంతోపాటు, వాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు రాము తెలిపారు.

యంత్రాలతో వరి నూర్పులు



వరి చేల నూర్పులో భారీ యంత్రం

రాంబిల్లి : మండలంలోని పలు గ్రామాల్లో రబీ వరికోత, నూర్పు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నూర్పు, కోత పనులకు రైతులు యంత్రాలను వినియోగిస్తున్నారు. యంత్రాలతో నూర్పు, కోత ఒకేసారి జరిగిపోతుండటంతో ఖర్చు, సమయం ఆదా అవుతుందని రైతులు చెప్తున్నారు. దీంతో మండలంలో ఉన్న యంత్రాలతో పాటు, పొరుగు జిల్లాల నుంచి యంత్రాలను అద్దెకు తెచ్చి మరీ వరి కోత, నూర్పులు చేపడుతున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

రాంబిల్లి : వాడపాలెంలో గురువారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. దుర్గాలమ్మ జాతర సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను యలమంచిలి జనసేన పార్టీ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల ఇన్‌చార్జిలు బైలపూడి శ్రీరాందాసు, పప్పల నూకన్నదొర పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో మునగపాక అభివృద్ధి



బీసీ కాలనీలో తుప్పల తొలగింపును పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : ప్రజల సహకారంతో మునగపాక గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. గురువారం మునగపాక బీసీ కాలనీ పరిధిలో తుప్పల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా పాలకవర్గానికి సహకరించి, అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు.

ఉపాధి కూలీలతో స్వచ్ఛ సంకల్పం



పాములవాకలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఉపాధి కూలీలు

కోటవురట్ల : స్వచ్ఛ సంకల్పంలో మేము సైతం అంటూ ఉపాధి కూలీలు ముందుకొచ్చారు. పాములవాకలో ప్రభుత్వ కార్యాలయాలు, మెయిన్‌రోడ్డు, పాఠశాలలు, వీధుల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో పాములు, విషపురుగులకు నిలయంగా మారాయి. ఈ సమస్యను మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాలతో గురువారం ఉపాధి హామీ పథకం కూలీలు జంగిల్ క్లియరెన్స్‌లో పాల్గొన్నారు. పిచ్చి మొక్కలు తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువకులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఎవరి పరిధిలో వారు పారిశుధ్య మెరుగుకు సహకరించాల్సిందిగా కోరారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

పాయకరావుపేట : పట్టణంలోని 10వ వార్డులో కడిమివారి వీధిలో డ్రైనేజీ కాలువ నిర్మాణానికి సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీశ్రీనివాస్‌లు గురువారం శంకుస్థాపన చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి పంచాయతీ పాలకవర్గం ఇటీవల ఆమోదం తెలిపింది. దీంతో కాలువ పనులు ప్రారంభించడానికి నాయకులు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పబ్లిక్ వింగ్ జిల్లా అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, వార్డు సభ్యులు పిరాధి రాజు, నాయకులు జగతా శ్రీను, లావేటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



రోగులకు మాత్రలు అందిస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు స్థానికులను సూచించారు. గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన 104 వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి రోగులకు మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామంలోకి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి లత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్రైట్ స్వచ్ఛంద సంస్థలో వేసవి శిక్షణ



వేసవి ఉచిత శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మందపాటి సునీత

తుమ్మపాల : బ్రైట్ స్వచ్ఛంద సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేస్తు ప్రజల మన్ననలు పొందుతోందని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. గాంధీనగరంలోని బ్రైట్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ కార్యక్రమాన్ని పట్టణ ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ లక్ష్మీపతితో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా నిరుద్యోగ యువత, మహిళలకు పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. సంస్థ సేవలకు ప్రభుత్వం నుంచి సాయం, సొంత భవనానికి ప్రభుత్వ స్థలం కేటాయించేలా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, సంస్థ వ్యవస్థాపకుడు శివశంకర్, కార్యదర్శి టి.జయశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షణ రంగంలో అపార ఉద్యోగావకాశాలు



విద్యార్థులకు పీపీటీ ద్వారా అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారి రంథ్వ

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం రక్షణ రంగంలో లభించే ఉద్యోగ అవకాశాలు, ఆయా ఉద్యోగ అవకాశాలకు నేర్చుకోవాల్సిన ఆర్మీ అధికారి మేజర్ రంథ్వ గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అగ్నిపథ్ ర్యాలీకి హాజరయ్యే విద్యార్థులకు, విద్యార్హతను బట్టి లభించే బోనస్ మార్కులను వివరించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీలో ప్రవేశాలు, ఆర్మీ నర్సింగ్ సర్వీస్ వంటి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ అధికారి మణికంఠ, ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మతల్లి జాతర



పూజలందుకున్న బంగారమ్మతల్లి

ఎస్.రాయవరం : బంగారమ్మపాలెంలో బంగారమ్మతల్లి జాతరను గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి ఏటా ఈ జాతరను మత్యకారులు అత్యంత వైభవంగా జరుపుతారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పసుపుకుంకుమలు, చీర, సారెలు సమర్పించారు. రాత్రికి భారీ బాణసంచా వెలిగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలునిర్వహించారు. జాతరను పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

కల్వర్టును బాగుచేయరూ..



మరమ్మతులకు గురైన కల్వర్టు

ఎస్.రాయవరం : మేజర్ పంచాయతీ దార్లపూడి ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డులో కల్వర్టు శిథిలావస్తకు చేరుకుంది. ఏడాది కాలంగా ఈ సమస్య ఉన్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మెయిన్‌రోడ్డులో కాలనీకి వెళ్లే దారిలో కల్వర్టుప పాడవడంతో, రాత్రిళ్లు రాకపోకలు చేసేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నట్టు వాపోతున్నారు. మండల అధికారులు దృష్టి సారించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఎస్సీ కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని మోటూరుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన 12 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు అందించారు. గురువారం స్థానిక ఏపీఐఐసీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌ఆర్ ప్యాకేజీ, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల పట్టాలు త్వరితగతిన అందించాల్సిందిగా అధికారులకు సూచించారు. ఎస్‌డీసీ సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, దేశంశెట్టి శంకరరావు, సర్పంచ్ దిగుమర్తి శాంతకుమారి, మాజీ సర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన జగనన్న ఇళ్లు



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల : వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణాలు, సంతులిత అభివృద్ధి లక్ష్యాల సర్వే, కల్యాణమస్తు, వలంటీర్ల ఈకేవైసీ తదితర అంశాలకు సంబంధించి సమీక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇచ్చిన లక్ష్యాలను ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ ప్రేమ్‌సాగర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశుని ధ్వజస్తంభ ప్రతిష్ట

నక్కపల్లి : మండలంలోని డొంకాడ గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు పూజా కార్యక్రమాలు జరిగాయి. యంత్రప్రతిష్ట, పుణ్యాహవచనం, హోమాలు, మండప పూజ తదితర కార్యక్రమాలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ దంపతులతోపాటు, గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు, పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల సమక్షంలో ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గురువారం వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు.

అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని, ధ్వజస్తంభం వద్ద పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ చందిన కొండలరావు, మాజీ సర్పంచ్‌లు ప్రగడ జగదీష్, చందిన ఆదినారాయణ, ప్రగడ మాణిక్యం, నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో ఘనంగా హోమాలు

నేడు దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట



పీఎస్‌ఆర్ పేట ఆలయం వద్ద హోమంలో పాల్గొన్న సర్పంచ్ శివలక్ష్మి దంపతులు

యలమంచిలి : మండలంలోని పీఎస్‌ఆర్ పేట, పేటబయ్యవరం జంట గ్రామాల ప్రజల ఆర్థిక సాయంతో నిర్మించిన దుర్గాదేవి ఆలయంలో గురువారం హోమం నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా రెండో రోజు పండితులు సోమయాజిశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగింది. రెండు గ్రామాల సర్పంచ్‌లు గొన్నాబత్తుల శివలక్ష్మి, మొగలపల్లి వెంకటసత్యనారాయణలు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. శుక్రవారం దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని కనుల పండువగా జరిపేందుకు ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని జంట గ్రామాల్లో ఊరేగించారు. అమ్మవారి విగ్రహాన్ని ధాన్యం, పాలు, పూలతో అభిషేకించారు. ఉత్సవాల్లో భాగంగా యువకులకు స్లో బైక్ రైడ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మొగ్గ గోవిందరావు, ఊటకూటి శేఖర్, కమిటీ సభ్యులు జెర్రిపోతుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'వేసవి క్రీడా శిబిరాలను వినియోగించుకోండి'



వేసవి క్రీడా శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఏ కన్నబాబు రాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : వేసవిలో నిర్వహించే క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) సూచించారు. అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. క్రీడాకారులకు క్రీడా సామాగ్రి అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ కోన బుజ్జి, సర్పంచ్ విమలనాయుడు, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీటీసీ లాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకూ ఉపాధి పనులు



రాజయ్యపేటలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నక్కపల్లి : తీరప్రాంత మత్స్యకారులకు ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు ఆదేశించారు. గురువారం ఆయన రాజయ్యపేటలో పర్యటించారు. తీరప్రాంత గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, జాబ్‌కార్డుదారులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం వేటనిషేధం అమల్లో ఉందని, ఈ నేపథ్యంలో మత్స్యకారులు ఉపాధి లేక ఇబ్బంది పడుతుంటారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఉపాధి సిబ్బంది మత్స్యకార గ్రామాల్లో కూడా పనులు ప్రారంభించాలని సూచించారు. జాబ్‌కార్డులు కలిగిన వారందరిని పనులకు పిలవాలన్నారు. ఎవరైనా జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేస్తే త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. వేటనిషేధ సమయంలో ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం వేసవి అలవెన్సుతో కలిపి గిట్టుబాటు వేతనాన్ని అందిస్తోందన్నారు. తక్షణమే పనులు గుర్తించి, స్థానికులతో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఏపీవో ఈశ్వరరావును సూచించారు. మండలంలోని రాజయ్యపేట, పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, బోయపాడు, డీఎల్‌పురం, అమలాపురం, బంగారయ్యపేట తదితర గ్రామాల్లో మత్స్యకారులకు ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో అభివృద్ధి



మాట్లాడుతున్న ఈవోఆర్డీ ఈశ్వరరావు

మునగపాక : ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఈవోఆర్డీ పీవీఎల్‌ఎన్ ఈశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో గ్రామాభివృద్ధి ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. గ్రామాల్లోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీలకు సంబంధించి పెండింగ్ బిల్లులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌ల సందేహాలను నివృత్తి చేశారు.

వారపు సంతకు మామిడి జోష్

- భారీ ధర పలికిన బంగినపల్లి
- పెరిగిన కూరగాయల ధరలు
- మచ్చుకైనా దొరకని అల్లం



కశింకోట వారపు సంతలో విక్రయిస్తున్న బంగినపల్లి మామిడి పండ్లు

కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం మామిడి పండ్లకు డిమాండ్ పెరిగింది. బంగినపల్లి పెద్ద సైజు మామిడి పండ్లు డజను రూ.600కు విక్రయించారు. చిన్న సైజు రూ.150కి అమ్మకాలు సాగాయి. సువర్ణరేఖలు రూ.120కి విక్రయించారు. ప్రస్తుతం వైశాఖ మాసం కావడంతో ఈ సీజన్‌లో పండే మామిడి పండ్లను సంప్రదాయంగా దేవుళ్లకు నివేదించి కుటుంబ సభ్యులు వాటిని ప్రసాదంగా సేవిస్తారు. దీంతోపాటు తినడానికి కొనుగోలు చేస్తారు. ఇప్పుడిప్పుడే ఇవి అమ్మకానికి రావడంతో ఎక్కువ ధరకు విక్రయాలు సాగాయి.

పెరిగిన ధరతో దొరకని అల్లం

సంతలో అల్లం కాన రాలేదు. కొనుగోలు చేద్దామంటే ఎవరూ అమ్మకాలు జరపని పరిస్థితి తొలిసారిగా ఏర్పడింది. ఇందుకు ధర ఒక్కసారిగా పెరిగిపోవడమే కారణం. నెల రోజుల క్రితం కిలో అల్లం రూ.30 ఉండగా, అది క్రమేపీ పెరిగి ప్రస్తుతం రూ.200కు చేరుకుంది. దీంతో చిల్లర వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో హోల్‌సేల్ వ్యాపారులు కూడా తీసుకురాలేదని సమాచారం. ఉత్పత్తి తగ్గడమే ఈ పరిస్థితికి కారణమని వ్యాపారులు చెప్తున్నారు.

పెరిగిన టమాట

సంతలో టమాటా ధర గత వారం కంటే కిలోకి రూ.5 పెరిగింది. గత వారం కిలో రూ.10 ఉండగా, ఈ వారం రూ.15కు పెరిగింది.అలాగే క్యారెట్, బీట్‌రూట్ రూ.40 నుంచి రూ.60కి, వెల్లుల్లి రూ.45 నుంచి రూ.60కి పెరిగాయి. ఉల్లిపాయలు రూ.20, బంగాళాదుంపలు రూ.25, వంకాయ, క్యాబేజీ రూ.30, బెండకాయ, దొండకాయ రూ.40, కాకర, బీర రూ.60, క్యాప్సికం రూ.100కు విక్రయాలు సాగాయి. ఇక కూరల్లో వేసుకునే జీలకర్ర రూ.590 నుంచి రూ.620కి పెరిగింది. గత రెండు రోజులుగా చల్లగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మధ్యాహ్నం ఎక్కువ ఎండ కాయడంతో కూరగాయల దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గడంతో యథాథావిధిగా అమ్మకాలు సాగాయి. అలాగే పంచాయతీ ప్రధాన రహదారి ఎండ తీవ్రతతో జన సంచారం తగ్గిపోయింది.